నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, శనివారం 7 సెప్టెంబర్ 2024 | BHADRADRI KOTHAGUDEM

- 6 రోజులైనా పూర్తికాని ప్రక్రియ.. అందని సాయం
- సర్వేల పేరుతో సాగదీస్తున్న అధికారులు
- ఖమ్మం రూరల్లో అల్లాడుతున్న వరద బాధితులు
- బ్లీచింగూ చల్లడంలేదంటూ గ్రామస్తులు

'సర్వే' సాగదీత

మున్నేరు వరద ఉధృతి తగ్గి రోజులు గడుస్తున్నా బాధితుల ఎదురుచూపులు ఇంకా ఎదురుచూపులుగానే ఉన్నాయి. సర్వం కోల్పోయిన తమకు రూ.10 వేల సాయ మందిస్తామంటూ సర్కారు చెప్పిందని.. అవి చేతికొస్తే తమకు ఎంతోకొంత అక్కర కొస్తాయని.. వరద బాధితులు ఆశించారు. కానీ సాయం చేస్తామన్న సర్కారు జాడ లేకుండా పోవడంతో వారి ఆశలన్నీ అడియాశలుగానే మిగులుతున్నాయి. సర్వేల పేరుతో సర్కారు సాగదీస్తుండడం, ఆరు రోజులైనా ప్రక్రియ ఇంకా పూర్తి కాకపోవడం వంటి కారణాలతో వరద బాధితులకు సర్కారు సాయం ఇంకా అందని ద్రాక్షగానే మిగిలింది. చివరికి తమ వీధులను శుభ్రం చేసే వారు కూడా లేరని, సిబ్బంది వచ్చి తమ ఇళ్ల ముందు బ్లీచింగ్ కూడా చల్లిన పరిస్థితి లేదని వాపోతున్నారు. కనీసం 'తిన్నారా?' అని పలుకరించి ఆహారం అందించిన అధికారులు కూడా లేరని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. –ఖమ్మం రూరల్, సెప్టెంబర్ 6

ఖమ్మం రూరల్ మండలంలో బురదమయమైన ప్రభుత్వ పాఠశాల ప్రాంగణం

ఖమ్మం రూరల్ మండలంలో వరద ఉధృతి తగ్గి ఆరు రోజులు గడిచినా సాయం కోసం బాధితులు ఎదురుచూస్తూనే ఉన్నారు. అధికారులు వచ్చి సర్వేలు చేస్తున్నారే తప్ప ప్రభుత్వం నుంచి ఏమాత్రం సాయం అందకపోవడంతో తమ బతుకులు ఏమిటి ఇలా అంటూ దిగులు చెందుతున్నారు. ఆకేరువాగు సమీపంలోని వాల్యతండా కస్నాతండా, పిట్టలవారిగూడెం, తనగంపాడు గ్రామాలు వరద తాకిడికి చిన్నాభిన్నమయ్యాయి. వీటితోపాటు తీర్థాల, పోలెపల్లి, పెద్దతండా, గుడిమళ్ల తదితర గ్రామాల పరిధిలోని కాలనీలకు తీవ్ర నష్టం వాటిల్లింది. పెద్దతండా పరిధిలోని రాజీవ్ గృహకల్ప, ఫోర్త్ క్లాస్ ఎంప్లాయీస్ కాలనీ, జలగం నగర్, నాయుడుపేట తదితర కాలనీల్లో రూ.కోట్లలో నష్టం వాటిల్లింది. ఇళ్లల్లోని సామగ్రి, బియ్యం, బట్టలు, పుస్తకాలన్నీ నీటి పాలయ్యాయి. ఇళ్ల నిండి బురద పేరుకుపోయింది. ఇంత జరిగినా ప్రభుత్వం అందించే చిరు సాయం కొద్ది ప్రాంతాలకే పరిమితమవుతుందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నగరానికి కూతవేటు దూరంలో ఉన్న ఇందిరమ్మ కాలనీ సగానికి సగం మునిగినా ఇంతవరకు పంచాయతీ కార్యదర్శి స్థాయి ఉద్యోగి కూడా తమ వైపు రాలేదని వారు వాపోతున్నారు. మురుగు కంపు కొడుతున్నా కనీసం బ్లీచింగ్ పౌడర్ చల్లే నాధుడు కూడా కరువయ్యాడని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాయుడుపేటలోని అనేక కాలనీల్లో సైతం ఇదే పరిస్థితి నెలకొంది. మూడు రోజుల నుంచి అధికారులు, సిబ్బంది సర్వే పేరుతో కాలయాపన చేస్తున్నారనే తప్ప పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.

తిన్నారా అని అడిగినోళ్లే లేరు..

వరదలు తగ్గినా తిన్నారా.. అడిగిన ఒక్క అధికారి కూడా లేడు. సాయం కూడా అందలేదు. తెల్లారేసరికి కాలనీ వాళ్లు వచ్చి మమ్మల్ని కాపాడకపోతే ఇంట్లో ఒక్కరం కూడా మిగిలేవాళ్లం కాదు. గత శనివారం వచ్చిన వరదలకు మా కాలనీలో దాదాపు సగం ఇండ్లు మునిగిపోయాయి. మా ఇంట్లో ఉన్న మూడు క్వింటాళ్ల బియ్యం అవతల పారబోస్తుంటే దుఃఖం వచ్చింది. కోడలికి బట్టలు లేకపోతే కొడుకు ప్యాంటు వేసుకొని పునరావాస కేంద్రంలో గడిపింది. సీఎం రేవంత్‌రెడ్డి చేస్తాను అన్న సాయం ఇటువైపు రాలేదు.
–గోలి మరియమ్మ, ఇందిరమ్మ కాలనీ, ఖమ్మం రూరల్

ఇందిరమ్మ కాలనీ అంటే అలుసా..

మా ఇల్లు వరదలో మునిగిపోయి కట్టుబట్టలు కూడా పనికిరాకుండా పోయాయి. కనీసం పంచాయతీ కార్యదర్శి వచ్చి ఎలా ఉన్నారు అని అడిగిన పాపాన పోలేదు. ఇంటిమందు దుర్వాసన వస్తుంది. సాయం చేయకున్నా బ్లీచింగ్ పౌడర్ చల్లించాలని కాలనీవాళ్లతో ఫోన్ చేయించినా ఎవరూ రాలేదు. వరదలతో ఇంట్లో ఫ్యాన్ చెడిపోయింది. ఇంటిని చేస్తుంటే బాధగా ఉంది. పేదలు ఉండే ఇందిరమ్మ కాలనీ అంటే అలుసా.. ఎవరూ పట్టించుకోవడం లేదు. కన్నెత్తి కూడా చూడడం లేదు.
–కట్ల ఉమ, ఇందిరమ్మ కాలనీ, ఖమ్మం రూరల్

స్వామీజీలు ఇచ్చిన దుప్పట్లే..

వరదల్లో మా ఇల్లు పూర్తిగా మునిగిపోయింది. అప్పటి నుంచి ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి మాకు ఎలాంటి సహాయం అందలేదు. గురువారం ఎవరో స్వామీజీ ఇచ్చి దుప్పట్లు ఇచ్చారు. అవి తప్ప ఏ సాయం అందలేదు. ఎవరో వచ్చి ఉదయం మా కుటుంబ వివరాలు తీసుకెళ్లారు. ఇల్లు ఒంపులో ఉండడంతో ఒక్క వస్తువు దక్కించుకోలేకపోయాం. వరద తగ్గిన తెల్లారి బీఆర్ఎస్ నాయకుడు రాకేశ్‌రెడ్డి వచ్చి చూసిపోయిండు. చేతిలో చిల్లిగవ్వ లేదు. కిరాణ సామాన్లు అందించాలి.
–పడిషాల సుజాత, సుతారి బజార్, నాయుడుపేట, ఖమ్మం రూరల్

ఇంట్లో వస్తువులన్నీ పాడయ్యాయి..

అర్ధరాత్రి వచ్చిన వరదలతో ఇంట్లో వస్తువులన్నీ పాడైపోయాయి. బట్టలు కూడా పనికి రాకుండా పోయాయి. టీవీ, ఫ్యాన్లు ఏమీలేవు. పునరావాస కేంద్రంలో రెండు రోజులు బువ్వ పెట్టారు. చెద్దరు ఇచ్చారు. అంతే.. ఇంతవరకు మాకు ఎలాంటి సాయం అందలేదు. ఏ సాయమైనా పై బజార్‌కు చేస్తున్నారు. కాళ్లు సరిగ్గా లేక నడవలేక పోతున్నా. సరుకులు ఇంటికి వచ్చి ఇస్తే బాగుంటుంది. పోయిన సామాన్లు ఇక కొనుక్కోలేం.
–కొట్టే సరోజనమ్మ, సుతారి బజార్, నాయుడుపేట, ఖమ్మం రూరల్

బౌద్ధ మందిరాలను అభివృద్ధి చేస్తాం..

కారుకొండ గుట్టల సందర్శనలో భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్

కారుకొండ బౌద్ధుల గుహను పరిశీలిస్తున్న కలెక్టర్ జితేశ్

లక్ష్మీదేవిపల్లి, సెప్టెంబర్ 6 : ప్రాచీన బౌద్ధ ధ్యాన మందిరాలను సుందరంగా తీర్చిదిద్ది పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దుతామని భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్ అన్నారు. కారుకొండ గుట్టలపై ఉన్న బౌద్ధ ధ్యాన మందిరాలను శుక్రవారం ఆయన సందర్శించారు. ధ్యాన మందిరాల విశిష్టత, చరిత్ర గురించి స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ అనేక దశాబ్దాల క్రితం బౌద్ధ మతస్తులు నిర్మించుకున్న ధ్యాన మందిరాలు, గుహలు ఎంతో ఆకర్షణీయంగా ఉన్నాయన్నారు. వీటిని పరిరక్షించేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. గుట్ట చుట్టూ రక్షణ కల్పించడంతోపాటు సోలార్ లైటింగ్ ఏర్పాటు చేస్తామన్నారు. ఆయన వెంట ఎంపీడీవో లక్ష్మీనారాయణ, ఎంపీవో శ్రీనివాసరావు, బుద్ధిస్టు సొసైటీ ఆఫ్ ఇండియా గౌరవ అధ్యక్షుడు ఆంతోటి నాగేశ్వరరావు, అధ్యక్ష, కార్యదర్శులు కొచ్చెర్ల కమలారాణి, మారపాక రమేశ్, మాజీ సర్పంచ్ బలరాంనాయక్, సింగరేణి డీవైజీఎం బీభత్స తదితరులు ఉన్నారు.

పకడ్బందీగా పారిశుధ్య పనులు

ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం, సెప్టెంబర్ 6: మున్నేరు ముంపు ప్రాంతాల్లో పకడ్బందీగా పారిశుధ్య పనులు కొనసాగుతున్నాయని, ప్రజలకు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పటిష్ట చర్యలు చేపడుతున్నట్లు ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య రక్షణకు వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. కేఎంసీలో 60, మిగతా ప్రాంతాల్లో 805 బృందాలు 40,315 ఇళ్లను సందర్శించినట్లు చెప్పారు. 38,848 మందికి వైద్య సేవలు అందించినట్లు తెలిపారు. 725 జ్వరం కేసులు, 62 డయేరియా, ఒక సీరియస్ కేసును గుర్తించామన్నారు. 9,590 మందికి మందులు ఇచ్చి.. ఇద్దరిని జిల్లా ఆసుపత్రికి రెఫర్ చేసినట్లు పేర్కొన్నారు. కేఎంసీలో 18, మిగతా చోట్ల 2 పునరావాస కేంద్రాల్లో బాధితులకు వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వైద్య సేవలు, మందులు అందించామన్నారు.

కేంద్రమంత్రి కాళ్లు పట్టుకున్న రైతు

- వరదల పరిస్థితిపై అన్నదాతల భావోద్వేగం
- కేంద్రమంత్రి ఎదుట 'ఇసుకమేట రైతు' కన్నీటి పర్యంతం
- జిల్లాలో పర్యటించిన కేంద్రమంత్రులు శివరాజ్, సంజయ్
- పాల్గొన్న డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు తుమ్మల, పొంగులేటి

వేదికపై రైతును ఓదార్చుతున్న కేంద్రమంత్రి, చిత్రంలో పొంగులేటి

ఖమ్మం, సెప్టెంబర్ 6 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): వర్ష బీభత్సానికి సర్వస్వం కోల్పోయిన తమను ఆదుకోవాలని కూసుమంచి మండలం కోక్యాతండాకు చెందిన హలావత్ నర్సింహారావు కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కాళ్లు పట్టుకుని ప్రాధేయపడ్డారు. కష్టాల్లో ఉన్న రైతులను అన్ని విధాలుగా ఆదుకోవాలని రైతులు పుట్టెడు కష్టంలో ఉన్నారని కేంద్రమంత్రికి శోకతప్త హృదయంతో విన్నవించాడు. వరదల వల్ల ఖమ్మం జిల్లాలో జరిగిన అపార వరద నష్టాన్ని ఏరియల్ సర్వే ద్వారా పరిశీలించడానికి శుక్రవారం వచ్చిన కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్, హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కూసుమంచి మండలం పాలేరు నవోదయ పాఠశాలలో రైతులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతుల నుంచి ఇబ్బందులు చెప్పాలని కేంద్ర వ్యవసాయమంత్రి కోరగానే కోక్యాతండాకు చెందిన హలావత్ నర్సింహారావు కేంద్రమంత్రి చౌహాన్‌కు అర్థమయ్యేలా హిందీలో వివరించారు. పంటనష్టం జరిగిన తీరు, అకాల వర్షం వల్ల తాము ప్రాణంగా భావించి తమను బతికించే గేదెలు, వ్యవసాయానికి ఉపకరించే ఎడ్లు, ఆదాయాన్నిచ్చే మేకలు, కోళ్లు, ఇంటి సామగ్రిని సర్వస్వం కోల్పోయామంటూ గద్గస్వరంతో భావోద్వేగానికి గురై కంటతడిపెట్టారు. ఆపదలో ఉన్న తెలంగాణ ప్రజలను ఆదుకోవాలని నర్సింహారావు ఒక్కసారిగా వేదికమీదకు వెళ్లి శివరాజ్ చౌహాన్ కాళ్లపై పడ్డారు. ఈఘటన అక్కడున్న రైతులు, అధికారులను చలింపచేసింది. అనంతరం కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌తో కలిసి దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా కొన్నిచోట్ల మట్టిపాలైన భూములకు, ఇసుక మేటలు వేసిన పంటలను పలువురు రైతులు చూపించి కంటతడి పెట్టుకున్నారు. నర్సింహారావు అనే రైతు భావోద్వేగానికి చలించిన కేంద్రమంత్రి.. ఆయన్ను వేదికపై పిలిపించుకుని గుండెకు హత్తుకుని ధైర్యం చెప్పారు. కాగా, ఏరియల్ సర్వేలో పంటల నష్టం గురించి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క.. కేంద్ర మంత్రులకు వివరించారు. రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఖమ్మం ఎంపీ రఘురామిరెడ్డి, కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, సీపీ సునీల్‌దత్ తదితరులు పాల్గొన్నారు.

- నేడు వినాయక చవితి
- వాడవాడలా కొలువుదీరనున్న విఘ్ననాథుడు
- ఇప్పటికే కొలువుదీరిన పార్వతీపుత్రుడి మంటపాలు
- 9 రోజుల పాటు పూజలు అందుకోనున్న ఏకదంతుడు
- వైభవంగా ఏర్పాట్లు చేస్తున్న ఉత్సవ కమిటీల బాధ్యులు

'జైజై గణేశా.. జై కొడతా..' అంటూ వీధివీధినా విజ్ఞనాథుడి భక్తిగీతాలు మార్మోగనున్నాయి. 'దండాలయ్యా ఉండ్రాల్లయ్యా.. దయుంచయ్యా దేవా..' అంటూ ఏకదంతుడి చాలీసాలు ప్రజ్వరిల్లనున్నాయి. విఘ్నాలు తొలగించే విఘ్ననాథుడిని నవరాత్రులపాటు పూజించేందుకు ఉమ్మడి జిల్లాలోని భక్తులు, ఉత్సవ కమిటీల బాధ్యులు ఏర్పాట్లు పూర్తిచేశారు. భారతీయుల అతి ముఖ్య పండుగల్లో ఇది ఒకటి. పార్వతీ పరమేశ్వరుల కుమారుడైన వినాయకుడి పుట్టినరోజునే వినాయక చవితిగా జరుపుకుంటారు. వేద పంచాంగం ప్రకారం ఈ ఏడాది భాద్రపద మాసంలోని శుక్ల చతుర్థి అంటే ఈ నెల 6 (శుక్రవారం) మధ్యాహ్నం 3:01 గంటలకు తిథిన ప్రారంభమైంది. మరుసటి రోజు అంటే 7న (శనివారం) సాయంత్రం 5:37 గంటలకు ముగుస్తుంది. అందుకని ఉదయ తిథి ప్రకారం వినాయక చవితి ఈ నెల 7 శనివారం నుంచి ప్రారంభమవుతుంది. దీంతో శనివారం భక్తులందరూ వినాయక విగ్రహాన్ని ప్రతిష్ఠించి పూజాది కార్యక్రమాలను ఆరంభిస్తారు. వీధి వీధినా వినాయక మంటపాలు ఏర్పాటుచేసి వాటిల్లో ఏకదంతుణ్ణి కొలువుదీరుస్తారు. తొమ్మిది రోజులపాటు విశేషపూజలు చేస్తారు. వినాయకచవితి సందర్భంగా ప్రత్యేక పూజలు, విగ్రహాలు, పత్రి తదితర విశిష్టతలపై ప్రత్యేక కథనం.
–ఖమ్మం/ కొత్తగూడెం టౌన్, సెప్టెంబర్ 6

జయములివ్వు బొజ్జగణేశా..

హిందూ పురాణాల ప్రకారం విఘ్నాలు తొలగించే వినాయకుడికే మొట్టమొదటి పూజలు చేయాలి. వినాయక చవితి రోజున భక్తిశ్రద్ధలతో గణపతిని ఆరాధిస్తే కష్టాలు తొలగిపోతాయని, సుఖశాంతులు నెలకొంటాయని పురాణోక్తి. అందుకని భక్తులందరూ వీధివీధినా చలువ పందిళ్లు, భారీ సెట్టింగ్‌లు ఏర్పాటు చేసి వాటిల్లో పార్వతీ పుత్రుడిని కొలువుదీర్చుతారు. రెండు జిల్లాల్లో కలిపి సుమారు 40 వేల మండపాల్లో గణనాథులు కొలువుదీరనున్నట్లు అంచనా. వీటిల్లో 20 అడుగుల ఎత్తయిన విగ్రహాలూ ఉండడను న్నాయి.

గణపతి పూజలు..

వినాయకచవితి నాడు భక్తులు వేకువ జామునే నిద్రలేచి పవిత్ర స్నానాలు ఆచరిస్తారు. ఇళ్లను శుభ్రం చేసుకుని ద్వారాలకు మామిడి తోరణాలు కడతారు. పూజ గదిలో బియ్యపు పిండితో ముగ్గులు వేస్తారు. పాల వెల్లి కట్టి దేవుడికి పీట వేస్తారు. పీటకు పసుపు, కుంకుమలతో బొట్లు పెడతారు. దానిపై గణపతి విగ్రహాన్ని నిలుపుతారు. కలశాన్ని నూతన వస్త్రంతో అలంకరించి గణపతికి ఆవాహన చేస్తారు. దీపారాధన చేస్తారు. ఫల పుష్ప పత్రాలతో పూజ చేస్తారు. గణపయ్యకు ఇష్టమైన ఉండ్రాళ్లు, తెల్ల నువ్వులు కలిపిన మోదకాలు, అప్పాలు, లడ్డూలు, పరమాన్నం, కుడుములను సమర్పిస్తారు.

వీధుల్లో సందడి..

శనివారం వినాయక చవితి పండుగ సందర్భంగా శుక్రవారం ఉమ్మడి జిల్లాలోని పట్టణాలు, గ్రామాల్లోని ప్రధాన వీధుల్లో సందడి కనిపించింది. గణపతి విగ్రహాలు, పత్రి, ఫలాలు కొనుగోలు చేస్తూ ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు కనిపించారు. గ్రామాల నుంచి సేకరించిన మారేడు, వాకుడు, గరికె, ఉమ్మెత్త, రేగు, ఉత్తరేణి, మర్రి, మామిడి, గన్నేరు, విష్ణుక్రాంతం, దానిమ్మ, దేవదారు, మధుపం, సింధువారం, జాజీపత్రం, గండకి, శమి, రావి, మద్ది, తెల్లజిల్లేడు పత్రాలను విక్రయిస్తూ వ్యాపారులు కనిపించారు. స్వచ్ఛంద సంస్థల బాధ్యులు భక్తులకు ఉచితంగా మట్టి గణపతులు అందించారు. ఖమ్మం నగరంలో స్తంభాద్రి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నవరాత్రోత్సవాలు ఘనంగా జరుగనున్నాయి.

జిల్లా ప్రజలకు ప్రముఖుల వినాయక చవితి శుభాకాంక్షలు

ఖమ్మం, సెప్టెంబర్ 6: గణేశ్ నవరాత్రి ఉత్సవాలను ప్రతి ఒక్కరూ శాంతియుత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని పలువురు ప్రజాప్రతినిధులు సూచించారు. శనివారం వినాయక చవితి సందర్భంగా జిల్లా ప్రజలకు మాజీమంత్రి పువ్వాడ అజయ్ కుమార్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు, ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియానాయక్ శుభాకాంక్షలు తెలిపారు. మట్టి విగ్రహాలను మాత్రమే ప్రతిష్ఠించి పర్యావరణానికి హాని కలగకుండా చూడాలని కోరారు.

కొత్తగూడెం పట్టణంలో విక్రయానికి సిద్ధంగా ఉంచి లంబోదరుడి విగ్రహాలు, పత్రి, పాలవెల్లి తదితర సామగ్రిని కొనుగోలు చేస్తున్న భక్తులు